క్లుప్తంగా

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి



ఎమ్మెల్సీ కవితతో నాగేంద్రబాబు

మల్లాపూర్: ఎమ్మెల్సీ, భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవితను బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి మద్దెల నాగేంద్రబాబు శనివారం హైదరాబాద్‌లోని ఆమె ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిశారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల జిల్లాలో బీఆర్‌ఎస్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

మంత్రికి పరామర్శ



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ శుక్రవారం మృతిచెందగా ఎమ్మెల్యే సంజయ్ శనివారం వేల్పూరు వెళ్లి, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

శ్రీసంత్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

కథలాపూర్: రాజారాం తండా గ్రామంలో శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. విగ్రహాలకు గ్రామస్తులు ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం, వర్షకొండ, ఎర్దండి సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మలు కొట్టే కార్యక్రమం ఉన్నందున ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు దృష్ట్యా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ భూక్యా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కల్లూర్, మాదాపూర్, సర్పరాజ్‌పల్లి, పైడిమడుగు, జోగిన్‌పెల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అసభ్యకర పోస్టులు పెడితే చర్యలు

పెగడపల్లి: సోషల్ మీడియాలో ఏ రాజకీయ పార్టీ, ఏ నాయకుడి గురించి అయినా అసభ్యకర పోస్టులు పెట్టినా, షేర్ చేసినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై సతీశ్ హెచ్చరించారు. ఇలాంటి వాటికి ముఖ్యంగా గ్రూప్ అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఆయన మాట్లాడారు. ఆధారాలు లేకుండా ఇతరుల గురించి గ్రూపుల్లో ఫొటోలు, వీడియోలు పెట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏమైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

బెల్ట్‌షాపుల్లో తనిఖీలు



ఆత్మనగర్‌లో పోలీసులు పట్టుకున్న మద్యం

జగిత్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయి. శనివారం జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల, బాలపల్లి, హన్మాజీపేట గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో తనిఖీలు చేశారు. మద్యం అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం పట్టివేత

మెట్‌పల్లిరూరల్: మండలంలోని ఆత్మనగర్‌లో ఓ బెల్ట్‌షాపుపై పోలీసులు శనివారం దాడి చేశారు. రూ.5,750 విలువైన మద్యం పట్టుకొని, నిర్వాహకుడు అజ్మత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంబురంగా ఎంగిలిపూల బతుకమ్మ



జగిత్యాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పెగడపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు

జగిత్యాలటౌన్: 9 రోజులపాటు జరిగే బతుకమ్మ వేడుకలు శనివారం ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యాయి. జగిత్యాల పట్టణంలో మహిళలు, యువతులు బతుకమ్మల ను అందంగా పేర్చి, ఆడిపాడారు. ప్రధాన కూడళ్లలో బల్దియా అధికారులు లైటింగ్ ఏర్పాటు చేశారు.

పెగడపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇంటి వద్ద వివిధ రకాల పూలతో బతుకమ్మలు పేర్చి, ఒక్కచోట చేర్చి, ఆడిపాడారు.

గొల్లపల్లి: మండలంలో మహిళలు, యువతులు, చిన్నారులు ఎంగిలిపూల బతుకమ్మను శనివారం సంబురంగా జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.

పథకాలను చూసే బీఆర్‌ఎస్‌లో చేరిక

• జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసే పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. శనివారం జగిత్యాల అర్బన్ మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ యూత్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పలు సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మహేశ్, సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు పరామర్శ

జగిత్యాల రూరల్ మండలంలోని బాలపల్లి సర్పంచ్ పడిగెల భూపతిరెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను ఎమ్మెల్యే సంజయ్ శనివారం పరామర్శించారు. వైద్యులను అడిగి, సర్పంచ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బాలముకుందం, సింగిల్‌విండో చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు తదితరులున్నారు.

జనచైతన్య యాత్రకు స్వాగతం..

జగిత్యాల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయం సాధించాలని, కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని హైదరాబాద్ వాసి, దివ్యాంగుడు మహేశ్ చేపట్టిన జనచైతన్య బైక్ యాత్ర శనివారం జగిత్యాల చేరుకుంది. ఎమ్మెల్యే సంజయ్ అతనికి స్వాగతం పలికి, సత్కరించారు. దివ్యాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అప్సర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు..



బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న లక్ష్మీనరసింహారావు

కథలాపూర్: భూషణరావుపేటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు శనివారం బీఆర్‌ఎస్‌లో చేరగా ఆ పార్టీ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు కండువాలు కప్పారు. ట్రాక్టర్ డ్రైవర్ల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీనే



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న జువ్వాడి కృష్ణారావు

మల్లాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతున్న కాంగ్రెస్ పార్టీయే రాష్ట్రంలో ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు అన్నారు. శనివారం మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్‌లో పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి, ఆహ్వానించారు. రాష్ట్ర ప్రజలందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్సేనని పేర్కొన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో నియంతల్లా పాలన సాగిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల గురించి గ్రామస్తులకు వివరించారు. సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్, సీడీసీ మాజీ చైర్మన్ కంది బుచ్చిరెడ్డి, వార్డుసభ్యుడు అనంతరెడ్డి, సీనియర్ నాయకులు కొత్తపెల్లి రాజరెడ్డి, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో సత్యం

మల్యాల: కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. మల్యాల మండలంలోని సర్వాపూర్ అనుబంధ గ్రామం కొత్తపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శనివారం కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి, ఆహ్వానించారు. చేరిన వారిలో వడ్డెర సంఘం అధ్యక్షుడు వరికొప్పుల సురేశ్, అంజయ్య, వెంకటి, అజయ్, సమ్మయ్య, చందు, సర్వాపూర్ బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు అది నరేశ్, తుడి తిరుపతి ఉన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శనిగరపు తిరుపతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నేరెళ్ల సతీశ్‌రెడ్డి, ఇమామ్, నక్క అనిల్, మోత్కుల నర్సయ్య, బట్టు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

'సహకార' బలోపేతానికి చేయూతనివ్వాలి



మాట్లాడుతున్న ప్యాక్స్ చైర్మన్ అంజిరెడ్డి

మల్లాపూర్: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చేయూతనివ్వాలని ప్యాక్స్ చైర్మన్ బద్దం అంజిరెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ మండలంలోని సిరిపూర్ సహకార సంఘం ఆవరణలో మహా జనసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నామని, పంట పెట్టుబడి కోసం రుణాలిస్తున్నామని తెలిపారు. కాగా, సభకు హాజరైన సిరిపూర్ రైతులు మూతపడిన పెట్రోల్ బంక్‌ను తెరిపించాలని, యూరియా కొరత లేకుండా చూడాలని నడికుడ రైతుల డిమాండ్ చేశారు. గత పాలకవర్గంలో జరిగిన అవకతవకలతో కొందరు డిపాజిటర్ల కాలపరిమితి పూర్తయినా వారికి నగదు చెల్లింపులు జరగడం లేదని పలువురు ప్యాక్స్ చైర్మన్, పాలకవర్గ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. పెట్రోల్ బంక్‌ను తెరిపించి, ప్రైవేటుగా నడిపించేందుకు టెస్కాబ్ చర్యలు చేపడుతోందని చైర్మన్ అంజిరెడ్డి అన్నారు. వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సహకార సంఘాలకు అనుమతి ఇస్తే సరిపడా యూరియా అందిస్తామని పేర్కొన్నారు. మాజీ సీఈవో చేసిన అవకతవకలతో డిపాజిట్‌దారులకు చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని, సదరు మాజీ సీఈవో ఆస్తులను జప్తు చేయించి, వేలం వేసి, వచ్చిన నగదుతో డిపాజిట్‌దారులకు ప్రతి పైసా చెల్లిస్తామని తెలిపారు. ప్యాక్స్ వైస్ చైర్మన్ దూలురు సుధాకర్‌రెడ్డి, సీఈవో రాజేశ్వర్ రెడ్డి, సర్పంచ్ నల్ల బాపురెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న స్వామి

బుగ్గారం: అనేక హామీలు ఇచ్చి, గద్దెనెక్కిన బీఆర్‌ఎస్ వాటి అమలును విస్మరించదని కాంగ్రెస్ పార్టీ ధర్మపురి నియోజకవర్గ నాయకుడు గజ్జెల స్వామి ఆరోపించారు. ధర్మపురిలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. నాయకులు నరసింహారెడ్డి, కుమార్ నాయక్, అయితరవేణి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

'దళితుల మధ్య చిచ్చుపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం'

కథలాపూర్: దళితబంధు పథకం పేరిట రాష్ట్ర ప్రభుత్వం దళితులను మోసం చేస్తోందని మెట్‌పల్లి పాత తాలుకా అంబేడ్కర్ సంఘం ఉపాధ్యక్షుడు కాయితి నాగరాజు ఆరోపించారు. శనివారం కథలాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సర్కారు మొదటి విడతలో ఊరికొకరికి దళితబంధు పథకం అమలు చేసి, దళితుల మధ్య చిచ్చుపెట్టిందని మండిపడ్డారు. రెండో విడత లబ్ధిదారుల జాబితా ప్రకటించి, ఎన్నికల కోడ్ వచ్చిందని నిలిపివేయడం వారిని అవమానించడమేనని అన్నారు. గత ఎన్నికల్లో మూడెకరాల భూమి ఇస్తామని మోసం చేశారని, ఇప్పుడేమో దళితబంధు పేరిట వంచించాలని చూస్తున్నారని మండిపడ్డారు. నాయకులు శ్రీనివాస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం



మల్లాపూర్: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని ప్యాక్స్ చైర్మన్ నేరెళ్ల మోహన్‌రెడ్డి అన్నారు. చిట్టాపూర్‌కు చెందిన నేరెళ్ల లక్ష్మీనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఎంపీటీసీ సభ్యురాలు మైస లక్ష్మి, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్ పంపించిన రూ.5 వేల ఆర్థికసాయాన్ని ఆయనకు అందించినట్లు తెలిపారు. రైతుబంధు సమితి అధ్యక్షుడు నూతుల లక్ష్మీనారాయణ, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నూతిపెల్లి దామోదర్, నాయకులు పాల్గొన్నారు.

అమృత వాటిక కోసం మట్టి సేకరణ



కోరుట్ల టౌన్: పట్టణంలోని పశువైద్య కళాశాల విద్యార్థులు అమృత వాటిక నిర్మాణం కోసం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం మట్టి సేకరించారు. కళాశాల అసోసియేట్ డీన్ మాధవరావు మాట్లాడుతూ.. దేశ సమగ్రత, సహజ సంపదను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ ప్రాంతాల్లో సేకరించిన మట్టిని కలశాల్లో భద్రపరిచి, ఢిల్లీలో అమృత వాటిక నిర్మాణం కోసం పంపిస్తామన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దైవ కృష్ణ, సురేశ్, శ్రీదేవి, వినయశ్రీ, రజియా సుల్తానా, వినయ శీల, రమ్య, రవికాంత్ ఉన్నారు.

నేషనల్ ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

కోరుట్ల: పట్టణంలోని మాస్ట్రో జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు చిలువేరి రష్మిత, సంకోజి వైష్ణవి, కొండా మేఘనలు నేషనల్ ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ ఆకుల రాజేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి ఉన్నత చదువుల కోసం ఏడాదికి రూ.80 వేల చొప్పున ఐదేళ్లపాటు స్కాలర్‌షిప్ వస్తుందని పేర్కొన్నారు.

గ్రామ బహిష్కరణ విధించిన వారిపై చర్య తీసుకోవాలి

మెట్‌పల్లి: రామారావుపల్లెలో కొన్ని కుటుంబాలకు గ్రామ బహిష్కరణ విధించిన పెద్దలపై అధికారులు చర్య తీసుకోవాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు మ్యాకల తుక్కారాం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

'గడపగడపకూ కాంగ్రెస్'ను విజయవంతం చేయాలి

పెగడపల్లి: మండలంలో ఆదివారం నిర్వహించే గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్ ఒక ప్రకటనలో కోరారు. దీకొండ, ల్యాగలమర్రి, రాజారాంపల్లి, కీచులాటపల్లి, ఎల్లాపూర్, రామబద్రునిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీ కార్డుల పంపిణీతోపాటు ప్రచారం ఉంటుందని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరయ్యే ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేటినుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



కోరుట్ల: విద్యుత్ కాంతుల్లో దుర్గాదేవి ఆలయం

జగిత్యాలటౌన్: ఆదివారం నుంచి తొమ్మిది రోజులపాటు నిర్వహించే దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు జగిత్యాల పట్టణంలో మండపాలు ముస్తాబయ్యాయి. మండపాల నిర్వాహకులు కొందరు పేరొందిన కళాకారులచే అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా తయారు చేయించారు. మార్కండేయ ఆలయంలో నవదుర్గా సేవా సమితి, అష్టలక్ష్మి ఆలయంలో కనకదుర్గ సేవా సమితి, ధరూర్ క్యాంపు కోదండ రామాలయ కల్యాణ మంటపంలో సువర్ణ దుర్గ సేవా సమితి, రైతుబజార్ వద్ద జయదుర్గా సేవా సమితి సభ్యులు, వాణీనగర్ రామాలయం, అరవింద్‌నగర్‌లో వేడుకలు కనులపండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

కోరుట్ల: శరన్నవరాత్రి ఉత్సవాలకు కోరుట్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం వద్ద గల దుర్గాదేవి ఆలయం ముస్తాబైంది. విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. తొమ్మిది రోజులు వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని నిర్వాహకులు తెలిపారు.

పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



రాయికల్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జగిత్యాల: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పొన్నాల లక్ష్మయ్యపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై రాయికల్ పట్టణంలో మున్నూరుకాపు నాయకులు శనివారం నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. నాయకులు కోల శ్రీనివాస్, కోల రాజు, నీలి చిన్నమల్లయ్య, ఆకుల లక్ష్మీనారాయణ, కొల్లూరి వేణు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: జగిత్యాల తహసీల్ చౌరస్తాలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. రాష్ట్ర జనాభాలో 20 శాతం ఉన్న తమ కులాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. నాయకులు సమిండ్ల శ్రీనివాస్, ముసిపట్ల లక్ష్మీనారాయణ, కొలగాని సత్యనారాయణ, కూతురు శేఖర్, ఉప్పు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండల కేంద్రంలో బీసీ నాయకులు పీసీసీ చీఫ్ రేవ ంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. బీసీలకు సముచిత స్థానం దక్కడం లేదని అనడం తప్పా అని ప్రశ్నించారు. నాయకులు ఉదిగిరి ఆదిరెడ్డి, రెబ్బస్ మల్లయ్య, మేర నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని మున్నూరుకాపు నాయకులు ఖండించారు. శనివారం సాయంత్రం మల్యాల అడ్డరోడ్డుపై ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, కొండగట్టు డైరెక్టర్ జున్న సురేశ్, మరాటి సత్తయ్య, భారతపు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్‌వి చిల్లర రాజకీయాలు



వెల్లుల్లలో ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మెట్‌పల్లిరూరల్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని మెట్‌పల్లి ఎంపీపీ మారు సాయిరెడ్డి హెచ్చరించారు. మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎంపీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రజాశ్రేయస్సు కోసం పాటుపడే ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, ఆయన తనయుడు సంజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వాటిని వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, పలువురు సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: ఎంపీ అర్వింద్ దళితులకు క్షమాపణ చెప్పాలని కోరుట్ల రూరల్ మండలంలోని దళిత సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. కోరుట్ల పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. దళితబంధు పథకం మంజూరు విషయంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు లబ్ధిదారుల వద్ద లంచం తీసుకున్నట్లు ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లు అంజయ్య, నర్సు రాజనర్సయ్య, గంగరాజు, నర్సయ్య, ఎంపీటీసీ సభ్యుడు గంగాధర్, నాయకుల పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఎంపీ అర్వింద్ కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుపై, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద వారి దిష్టిబొమ్మలు దహనం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దశరథ్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పొనకంటి వెంకట్, ఎంపీటీసీ సభ్యుడు తిమ్మణి రాములు, నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి వద్ద సంగెం–శ్రీరాంపూర్ సర్పంచ్ పాలేపు దిలీప్ బీఆర్‌ఎస్ దళిత నాయకులతో కలిసి శనివారం నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. దళితబంధు పథకం అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై, స్థానిక ఎమ్మెల్యేలపై ఎంపీ అర్వింద్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. లబ్ధిదారుల వద్ద నుంచి కోరుట్ల ఎమ్మెల్యే రూ.3 లక్షలు తీసుకున్నారని అనడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన తీరు దళితబంధు పథకాన్ని నీరుగార్చేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు బదినపెల్లి ప్రేమ్, ఎంపీటీసీ సభ్యుడు ఆకుతోట రాజేశ్ బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు మ్యాకల సతీశ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పెద్దిరెడ్డి లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీని వెంటనే రద్దు చేయాలి



ధర్మపురిలో బైఠాయించిన బీఎస్పీ నాయకులు

బుగ్గారం/వెల్గటూర్: రాష్ట్రంలో నిరుద్యోగుల ఆత్మహత్యలు బాధాకరమని బీఎస్పీ ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నక్క విజయ్‌కుమార్ అన్నారు. నిరుద్యోగ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ధర్మపురిలో శనివారం శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. టీఎస్‌పీఎస్సీ అసమర్థత కారణంగా ప్రవళిక అనే యువతి ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వెల్గటూర్‌లో ర్యాలీ చేపట్టారు. టీఎస్‌పీఎస్సీని వెంటనే రద్దు చేయాలన్నారు. నిరుద్యోగులను మోసం చేస్తున్న అసమర్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు కుశనపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బచ్చల స్వామి, ప్రధాన కార్యదర్శి గంగాధర్, కోశాధికారి రాజు, నాయకులు జెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పరీక్షల నిర్వహణలో విఫలమైన టీఎస్‌పీఎస్సీ పాలకవర్గాన్ని రద్దు చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి పుప్పాల లింబాద్రి డిమాండ్ చేశారు. శనివారం మెట్‌పల్లి పట్టణంలోని జాతీయ రహదారిపై నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. పోటీ పరీక్షలు వాయిదా వేయడంతో నిరుద్యోగులకు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న ప్రవళిక కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. నాయకులు అమర్, లక్ష్మణ్, బాలరాజ్, నవీన్ తదితరులున్నారు.

రూ.2.79 లక్షలు పట్టివేత



బుగ్గారం: ధర్మపురి మండలంలోని రాయపట్నం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా.. వివిధ వాహనాల్లో తరలిస్తున్న రూ.2.79 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉదయం నుంచి జరిపిన తనిఖీల్లో మూడు వాహనాల్లో నగదు లభించినట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు. సీఐ రమణమూర్తి, ఎస్సై రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.